క్లుప్తంగా

మొక్కలను సంరక్షించాలి



మొక్కను పరిశీలిస్తున్న కమిషనర్ రాజశేఖర్

సుల్తానాబాద్: మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని మార్కండేయ కాలనీలో సోమవారం మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న హరితహారం విజయవంతం చేయాలని కోరారు. ప్రతి వార్డులో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించి వాటిని పెంచేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో హరితహారం ఇన్‌చార్జి ఆరెపల్లి కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న నాయకులు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ కుటుంబానికీ రూ.10వేలు ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఇవ్వగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిప్పారపు కమల వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. తిప్పారపు దయాకర్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మున్సిపల్ అధ్యక్షులు ఆరెపల్లి ఇలారావు, గొర్రె వెంకటస్వామి, ఎస్సీ సెల్ కార్యదర్శి కల్వలరాజు, ఆరెపల్లి సరేశ్, ఆరెపల్లి సునీల్, నవీన్, మహంకాళి శంకరయ్య, న్యాతరి శ్రీనివాస్ ఉన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

జూలపల్లి: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలతో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి సంపత్ రెడ్డి, కలీమొద్దీన్, వసంత, అనంతరావ్, స్వప్న పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

జూలపల్లి: ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధి అవకాశాలు ఉన్న ఉచిత వృత్తి విద్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ మండల ఆర్గనైజర్ గుంటి శంకర్ కోరారు. స్థానిక వెలుగు సమాఖ్య కార్యాయలంలో మంగళవారం సమావేశం నిర్వహించి ఉచిత శిక్షణపై అవగాహన కల్పించారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 30 ఏళ్లలోపు గల నిరుద్యోగులకు బైక్ మెకానిజం, సోలార్, నర్సింగ్, టైలరింగ్, బ్యాంకింగ్ కోర్సులు ఉన్నాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారని వివరించారు. అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు మండల ఆర్గనైజర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని పాలకులు



మాట్లాడుతున్న రాజనర్సయ్య

పాలకుర్తి: మండలంలో సమస్యలు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాలకులకు మాత్రం ప్రజా సమస్యలపై పట్టింపులేదని బీఎస్పీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరికిల్ల రాజనర్సయ్య ఆరోపించారు. బసంత్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకుర్తి మండల కేంద్రంగా ఏర్పాటై ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మండల కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించలేదని, ప్రజా సమస్యలను గాలికొదిలేసిన పాలకులకు మండల ప్రజలు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో పార్టీ రామగుండం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మారపెల్లి రవికుమార్, కార్మిక విభాగం అధ్యక్షుడు సిరికొండ సది, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణపూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దత్తు కుటుంబానికి మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు రూ.8వేలు అందజేశారు. సంఘం నాయకులు వెంకటస్వామి, శంకర్, వీరేందర్ ఉన్నారు.

జాడలేని యంత్రలక్ష్మి

- అటకెక్కిన వ్యవసాయ పనిముట్ల సబ్సిడీ
- నాలుగేళ్లుగా నిధులు కేటాయించని రాష్ట్ర ప్రభుత్వం
- సాగుభారం పెరిగి ఇబ్బందుల్లో రైతులు

> ధర్మారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మేలు చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామనడమే కానీ వాటిలో చాలా పథకాలు అమలుకు నోచుకోవడం లేదు. ఈ కోవలో యంత్రలక్ష్మి పథకం 2019 నుంచి జాడలేకుండా పోయింది. దీంతో ఎన్నో ఆశలతో రైతన్నలు వర్షాకాలం పంటలసాగుపై దృష్టిసారించారు. ఈక్రమంలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలంబాటపట్టారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం అందడంలేదు. ఓ వైపు ప్రత్యామ్నాయ పంటలు వేయాలని చెబుతూనే.. మరోవైపు రాయితీ విత్తనాలు, సబ్సిడీ పనిముట్లు వంటి పథకాలు కానరాకుండా పోయింది.



వ్యవసాయ పరికరాలు

అధిక భారంతో పంటల సాగు..

వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగం పెరిగింది. ఎద్దుల నాగళ్లతో దుక్కులు దున్నడం పూర్తిగా నిలిచిపోయింది. ఆధునిక కాలానికి అనుగుణంగా ట్రాక్టర్స్‌తోనే రైతులు దుక్కులు శుద్ధిచేసుకుంటు సాగుచేస్తున్నారు. అయితే ప్రభుత్వం సబ్సిడీపై ఎలాంటి వ్యవసాయ పరికరాలు అందించకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు లక్షలు వెచ్చించి యంత్రాలను కొనుగోలు చేయలేక తమ పొలం పనుల సమయంలో పెద్ద రైతులను ఆశ్రయిస్తున్నారు. దీంతో యంత్రాల భారం అధికమై ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. గతంలో వ్యవసాయ పరికరాలను రాష్ట్రప్రభుత్వం 50శాతం సబ్సిడీతో అందిస్తామని ప్రకటించింది. ఈమేరకు యంత్రలక్ష్మి పథకాన్ని ఏనిమిదేళ్ల క్రితం ప్రవేశపెట్టింది. కాని 2019 నుంచి ఈ పథకం అమలు కాకుండా నిలిపివేసింది. దీంతో సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

అందాల్సిన పరికరాలు ఇవే..

పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారి చేసేందుకు పంప్‌లు, ట్రాక్టర్‌కు ఉపయోగించే నాగళ్లు, డిస్కులు, రోటవెటర్లు, పెట్రోల్ పంప్‌తో పాటు పలు రకాల వ్యవసాయ పనిముట్లు సబ్సిడీలో అందించాల్సి ఉంది. రైతు బంధు అమలు చేసినప్పటి నుంచి ఈ యంత్రలక్ష్మి పథకం పత్తాలేకుండా పోయింది.

ఇక్కట్లు పడుతున్న రైతులు..

సబ్సిడీ యంత్రాలపై ఇప్పటి వరకు ఎదురుచూసిన రైతులు బహిరంగ మార్కెట్లో తమకు కావాల్సిన పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఈ పరికరాలు అధిక ధరలున్నాయి. వాటిని కొందరు రైతులు సొంతంగానే కొనుగోలు చేస్తుండగా మరికొందరు అద్దెకు తెచ్చి తమ సాగు పనులు చేసుకుంటూ ఇబ్బందులుపడుతున్నారు.

సబ్సిడీ పరికరాలు అందించాలి



ప్రభుత్వం సబ్సిడీ అందించకపోవడంతో సాగు సమయంలో రైతులకు యంత్ర పరికరాల కొనుగోలు భారంగా మారింది. రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై ఇవ్వాలి.
– గడ్డం కొమురెల్లారెడ్డి, బంజేరుపల్లి

రైతులపై భారం



రైతులకు సబ్సిడీపై పరికరాలు అందించకపోవడంతో రైతులకు భారం పడుతోంది. పండ్లతోటలు సాగుచేస్తున్నవారికి కూడా సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్స్ ఇవ్వడం లేదు. దీంతో లక్షలు వెచ్చించే స్తోమత లేని రైతులు పండ్లతోటల సాగుకు దూరంగా ఉంటున్నారు. – బొమ్మరవేని కుమార్, పెర్కపల్లి

గ్రామపంచాయతీ సిబ్బంది నిరసన ర్యాలీ

ధర్మారం: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నిరసన తెలుపుతున్న కార్మికులకు కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ మద్దతు తెలిపారు. ర్యాలీ పాత బస్టాండు వరకు కొనసాగుతుండగా రోజువారీ కూలీలతో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌బాబు పంచాయతీ ట్రాక్టర్ సాయంతో చెత్తను తరలిస్తుండగా కార్మికులు ట్రాక్టర్ ఎదుట బైఠాయించి అడ్డుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడు ఆకుల రాజయ్య, కార్యదర్శి రాగుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, శ్రీనివాస్, మల్లయ్య, రవికుమార్, నవీన్ పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఖాజా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద దీక్షా శిబిరాన్ని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ మంగళవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

పాలకుర్తి: పాలకుర్తి మండల కేంద్రంలో దీక్షా



చెత్తను తరలిస్తున్న ట్రాక్టర్ ఎదుట బైఠాయించిన కార్మికులు

శిబిరాన్ని బీఎస్పీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ సందర్శించి మద్దతు ప్రకటించిచారు.

ఓదెల: మండలంలో పంచాయతీ కార్మికుల సమ్మె ఆరోరోజుకు చేరింది. ఓదెల గ్రామంలో మంగళవారం ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

సమ్మెకు జెడ్పీటీసీ సంఘీభావం

ఓదెలలో చేపట్టిన పంచాయతీ కార్మికుల సమ్మెలో జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

జూలపల్లి: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

ఎలిగేడు: మండల కేంద్రంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీగా ఎలిగేడు బస్టాండు ఆవరణలో ఉన్న అంబేడ్కర్ వద్దకు చేరుకుని విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

కాల్వశ్రీరాంపూర్: యూనియన్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి, ర్యాలీగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష కొనసాగించారు.

'40ఏళ్లలో మీరు చేసిందేంటో'?



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గోదావరిఖని: 40 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందో.. తొమ్మిదేళ్లలో తాము చేసిన అభివృద్ధి ఏమిటో ప్రధాన చౌరస్తాలో చర్చకు రావాలని బీఆర్ఎస్ నాయకులు తోడేటి శంకర్‌గౌడ్ సవాల్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరుతో మోసం చేశారని ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదని, తప్పు చేసిన వారిని జైలుకు పంపించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలాగా దోపిడీలు, దొంగతనాలు బీఆర్ఎస్‌లో ఉండవన్నారు. బూడిద కాంట్రాక్టు ఎవరిదో దమ్ముధైర్యం ఉంటే చెప్పాలన్నారు. బూడిద కాంట్రాక్టర్‌తో ఎమ్మెల్యేతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. నాయకులు నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, అచ్చె వేణు, దాసరి శ్రీనివాస్, తుమ్మేటి వాసు పాల్గొన్నారు.

సిద్దిపల్లెకు భూమి కేటాయించడంపై ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామప్రజలు

కమాన్‌పూర్: కమాన్‌పూర్ గ్రామపంచాయతీకి చెందిన ప్రభుత్వ భూమిని సిద్దిపల్లె గ్రామపంచాయతీకి కేటాయించడాన్ని నిరసిస్తూ కమాన్‌పూర్ గ్రామ ప్రజలు మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ దత్తు ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు.

గోశాలకు మైక్‌సెట్ బహూకరణ

సుల్తానాబాద్: పట్టణంలోని గొల్లపల్లి శ్రీధర్మశాస్త్ర గోశాల నిర్వాహకులకు బీజేపీ జిల్లా నాయకుడు ఏగోలపు సదయ్యగౌడ్ మైక్‌సెట్ బహూకరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, నాయకులు పాల్గొన్నారు

ఎంపీ పుట్టినరోజు వేడుకలు

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్ ఆధ్వర్యంలో యాదవ్‌నగర్‌లోని శ్రీ ధర్మశాస్త్ర గోశాలలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

✦విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పాలకుర్తి: గోదావరి అర్బన్ బ్యాంక్ వేంనూర్‌శాఖ పదో వారికోత్సవం సందర్భంగా మండలంలోని కుక్కలగూడూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అదేవిధంగా బ్యాంక్ ఆవరణలో బ్యాంక్ సిబ్బంది మొక్కలు నాటారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బ్యాంక్ మేనేజర్ కొమ్ము రమేశ్, సిబ్బంది గర్వందుల తిరుపతి, జయ, శంకర్, వెంకటేశం పాల్గొన్నారు.

✦విద్యాసంస్థల బంద్‌కు డీవైఎఫ్ఐ మద్దతు

గోదావరిఖనిటౌన్: వామపక్ష విద్యార్థి సంఘాలు 12న చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్ తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలనే తదితర సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

✦15న మండల సర్వసభ్య సమావేశం

జూలపల్లి: 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాలరావు తెలిపారు. ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసే సమావేశానికి పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్ హాజరు కానున్నట్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొనాలని సూచించారు.

✦డీటీఎఫ్ నాయకుల డిమాండ్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే వర్కర్ల సమస్యలకు పరిష్కారం చూపాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాంకిషన్‌రావు, ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి కోరారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు వీలుగా వర్కర్ల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు.

✦బండి సంజయ్ జన్మదిన వేడుకలు

ఎలిగేడు: బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. పార్టీ మండల అధ్యక్షుడు కోదాటి వెంకటరమణారావు, నాయకులు కాంపెల్లి ప్రభాకర్, అడ్డగుంట తిరుపతి, చౌదరి తిరుపతియాదవ్, ఎల్క శంకర్, వంగ శ్రీకర్, పర్శరాములుగౌడ్, రాకేశ్, అల్లి మనోజ్ పాల్గొన్నారు.

✦ఆర్థిక చేయూత

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌కు చెందిన నిరుపేద నేత కార్మికుడు ఒడ్నాల రంగయ్య అనారోగ్యంతో రెండురోజుల క్రితం మరణించాడు. కాగా పద్మశాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్ రూ.5వేలు పంపించగా మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశం, నాయకులు శాతల్ల కాంతయ్య, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు జెట్టి సతీశ్, అంతయ్య, వేల్పుల గట్టయ్య, గుమ్మడి స్వామి, హరీశ్, భూమయ్య, సంపత్, రమేశ్ తదితరులు ఉన్నారు.

కులవృత్తులకు అధిక ప్రాధాన్యం



గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయిలు వెచ్చిస్తూ కులవృత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్యాలలో గొర్రెల కాపరులకు రెండో విడతలో ఎమ్మెల్యే గొర్రెలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రెండో విడతలో రూ.10.50కోట్లు వెచ్చించి 840 యూనిట్ల గొర్రెల పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచ్ లంక రాజేశ్వరి, ఎంపీటీసీ రాంచంద్రం, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, యాదవ సంఘం, గొర్రెల పెంపకందారులు తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి పెద్దపీట

ఓదెల: యాదవుల సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్దపీట వేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బీమారిపల్లె గ్రామంలో మంగళవారం యాదవులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీపీ కునారపు రేణుకదేవి, సర్పంచ్ కల్లెపల్లి సరిత, రైతు సమన్వయ సమితి మండల చైర్మన్ కావటి రాజు, ఎంపీటీసీ ఐరెడ్డి సరోజన, జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఓదెల పశువైద్యాధికారి కుమారస్వామి, ఉప సర్పంచ్ చదువు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



సంఘీభావం తెలుపుతున్న సునీల్

సుల్తానాబాద్: మధ్యాహ్న భోజనం పథకం వర్కర్ల పెండింగ్ బిల్లులను రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ డిమాండ్ చేశారు. రెండోరోజు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట చేస్తున్న సమ్మెను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 8 ప్రకారం బకాయిలు వెంటనే విడుదల చేయాలని, వంట సరుకులు, కోడిగుడ్లు, వంట పాత్రలు, గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం మండల అధ్యక్షురాలు టి.లావణ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓదెల రమేశ్, జి.రత్నమాల, జి.లీలావతి, నరేశ్, లింగయ్య, అంజమ్మ, సరోజన, లావణ్య, లింగమ్మ, స్రవంతి, రేణుక, పద్మ, సత్తమ్మ, సమీనా ఉన్నారు.

మధ్యాహ్న భోజనం వర్కర్లకు రూ.6వేల వేతనం చెల్లించాలి

కాల్వశ్రీరాంపూర్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మాధ్యాహ్నభోజన కార్మికులకు నెలకు ఆరు వేల వేతనం చెల్లించాలని యూనియన్ డిమాండ్ చేసింది. ఎంఈవో కార్యాలయం ఎదుట మంగళవారం చేపట్టిన నిరసన దీక్ష రెండోరోజుకు చేరింది. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. యూనియన్ సభ్యులు రాజేశ్వరి, విజయ, మల్లీశ్వరి, సరిత, సరోజన, కొమురమ్మ, లక్ష్మి, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అవసరం లేదని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. చౌరస్తా వరకు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణదాసు మారుతి, జేవీరావు, జావిద్‌పాషా, దీటి బాలరాజు, కలువల సంజీవ్, పిల్లి రమేశ్, అచ్చె వేణు, అదర్ సందె సమ్మారావు, ముద్దసాని సంధ్యారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని: డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్‌పై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు చేసిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం వన్‌టౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు. తప్పుడు పోస్టింగ్‌లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు యుగేందర్, కాలువ లింగస్వామి, మహంకాళి స్వామి, మాదరబోయిన రవికుమార్, ముస్తఫా, ప్రకాష్, శంకర్, ఓదెలు, శేఖర్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

సుల్తానాబాద్: మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాక మహేశ్ కోరారు. సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. బుధవారం నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్తున్నామని, దానికి సహకరించాలని విన్నవించారు. సమాన పనికి సమాన వేతనం అందజేయాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది ప్రతీ ఒక్కరు తరలిరావాలని కోరారు. సుల్తానాబాద్ పట్టణ మున్సిపల్ యూనియన్ అధ్యకుడు శ్రావణ్‌కుమార్, కోశాధికారి రమేశ్ ఉన్నారు.

పట్టణ సమాఖ్య అడ్‌హక్ కమిటీ సమావేశం

కోల్‌సిటీ: రామగుండం పట్టణ సమాఖ్య ఏర్పాటు చేయడంలో భాగంగా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేయడానికి, 19న ఉదయం 10గంటలకు రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కుమార్ దీపక్ తెలిపారు. సమావేశానికి రామగుండం పట్టణ సమాఖ్యలో సభ్యత్వం ఉన్న స్లమ్ లెవెల్ ఫెడరేషన్ ఆఫీసు బేరర్లు అందరూ సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. హాజరైన సభ్యులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, మెప్మా పీడీ(అర్బన్) డీఎంసీ సమక్షంలో అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.



రైల్వే వంతెనపై చిమ్మ చీకట్లు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రధాన వంతెనపై ఇరువైపుల స్ట్రీట్ లైట్స్ వెలగకపోవడంతో రహదారి చీకటిమయమైంది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వంతెనలో రైల్వేస్టేషన్‌వైపు సగభాగం స్ట్రీట్ లైట్స్ వెలుగుతుండగా రామగుండం మసీద్ కార్నర్ వైపు వెలగడం లేదు. దీనిపై బల్దియా అధికారులు స్పందించి స్ట్రీట్‌లైట్లు వెలిగేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి నిధుల రికవరీకి ఆదేశం



కమాన్‌పూర్‌లో సామాజిక తనిఖీ ప్రజావేదిక

కమాన్‌పూర్: మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగిన రూ.20,978ను రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ 13వ సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. సామాజిక బృందం సభ్యులు పరిశీలించి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజావేదికలో అధికారులకు వివరించారు. మండంలో రూ.20,978లు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఎంపీపీ రాసకొండ లక్ష్మి, డీఆర్‌డీవో పీడీ శ్రీధర్, ఎంపీడీవో విజయ్‌కుమార్, సర్పంచ్‌లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.